సామెతకథలు

# గుమ్మడి కాయలదొంగా అంటే బుజాలు తడుముకొన్నట్లు

**- శ్రీ మునునూరి లక్ష్మీగణపతిశాస్త్రి.**

ఒక ఊళ్ళో కరణంగారి యింట గుమ్మడికాయలు కన్నుకుట్టేటట్లు విరగకాశాయి. ఆ సంవత్సరం ఆయన ఒక రోజున పొరుగు ఊరు పోవలసివచ్చింది. చుట్టుప్రక్కల వారికి మాయింటిపై ఓకన్నేసి ఉంచండని చెప్పి మరీ వెళ్ళారు.

కటిక దరిద్రంతో కుమిలిపోతున్న కామన్న అదనుకై చూచి ఆ కాయలను అర్థరాత్రినుండి అదేపనిగా రెండేసి కాయలచొప్పున తెల్లవార్లు కోసి పొరుగూరునకు పట్టుకొనిపోయి సంతలో అమ్మివేశాడు. ఆ విధముగా రాత్రి తెల్లవార్లు కోసికొని బుజాలు కాటెక్కేటట్టుగా మోసుకొని పోవడంచేత, బుజాలనంటుకున్న నూగు దురద పుట్టడంచేత, పదేపదే గోక్కోసాగాడు. ఇంకొకమూల నిద్రముంచుకొనివస్తోంది. రచ్చబండకడకు జేరేసరికి పదుగురుచేరి "కరణంగారి యింట్లో గుమ్మడికాయల దొంగతనం జరిగింది. అవి ఎట్లాగైనా పట్టి కరణంగారికి ఇప్పించాలి" అని తీర్మానం చేసుకున్నారు. అదే సమయానికి అటకుజేరి, ఓ గోడకు జేర్లబడి, కునికిపాట్లు పడుతూ, అప్రయత్నంగా బుజాలు తడువుకోవడం మొదలుపెట్టాడు కామన్న.

ఒంటికి పట్టిన నూగు పూర్తిగా దులిపివేసుకోకపోవడంచేత, దురదపుట్టి గోక్కోవడంచేత, అక్కడివారు "వీడు మాటిమాటికి బుజాలు తడుముకొంటున్నాడు. దురదకు ఒళ్ళుగోక్కుంటున్నాడు. ఇప్పుడే ఎక్కడినుండో వస్తున్నాడు. వీణ్ణి పరిశీలించండి." అన్నాడొకడు. గుమ్మడికాయల దొంగ అన్నప్పుడల్లా ఉలికులికి పడడంతో మరీ అనుమానించి, అతని బుజాలు నిశితంగా చూచేటప్పటికి కొట్టవచ్చినట్లు కానవచ్చింది నూగు. అసలు రహస్యం అప్రయత్నంగా దొరికినందుకు వాణ్ణి నిద్రలేపి కాయలు ఎక్కడకు చేర్చాడో ఆచూకీ లాగేశారు. ఎన్నడూ దొంగతనం చేయని వాడు, క్రొత్తగా చేయబోతే ఇలాగే తనకు తానై బయటపడి పోతాడని దీని వలన బుజువౌతుంది. *

### *ఎవరు దొంగ?*

*కలికాలంలో ఈ సామెత చెల్లదేమో! ఎందుకంటే ఎవ్వరైనా 'గుమ్మడికాయల దొంగ' అనగానే, బుజాలు తడుముకొనే బదులు, ఆ దొంగ అవతలివారిని 'పుచ్చకాయల దొంగ' అని చూపెట్టి, జనాల్ని ప్రక్కదోవ పట్టించడం మనం చూస్తున్నదే కదా! నాటి సత్యపీఠం (నేటి లైడిటెక్టర్) కూడా వీరి చాతుర్యం ముందు తలవంచవలసినదే! చాలా సందర్భములలో వీరిని వారు, వారిని వీరు దొంగలుగా చిత్రీకరించి, అసలు దొంగ ఎవరో నిర్ధారణ అయ్యేసరికి రెండు జీవితముల కాలం గడిచిపోతుంది. అంతకు ముందే జనం ఆ సంగతి మరచిపోతారు.*